www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 29 ఏప్రిల్ 2025



శ్రీసిటీని సందర్శించిన జపాన్ రాయబారి

ప్రజాశక్తి - సత్యవేడు

భారత్ లోని జపాన్ రాయబారి ఒనో కెయిచి సోమవారం శ్రీసిటీని సందర్శించారు. గత నవంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం మొట్టమొదటి సారి శ్రీసిటీలో పర్యటించారు. చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ తకహాషి మునియో, ఇతర అధికారులతో కలిసి పర్యటనకు విచ్చేయగ, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికారు. 31 దేశాలకు చెందిన 235 కంపెనీలకు శ్రీసిటీ నిలయంగా ఉందని వివరించారు. జపనీస్ సంస్థలకు భారతదేశంలో రెండవ అతిపెద్ద పెట్టుబడి గమ్యస్థానంగా ఆవిర్భవించిందన్నారు.

శ్రీవారి దర్శనానికి వెళ్లి...వస్తూ..!

కంటైనర్ కిందకు దూసుకుపోయిన కారును జేసీబీ సాయంతో తీస్తున్న దృశ్యం

ఐదుగురు దుర్మరణం

అంతా ఒకే కుటుంబ బంధువులే
అతివేగమే ప్రాణం తీసిందా..?

ఇద్దరికి తీవ్ర గాయాలు

ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి
మృతులంతా చెన్నయ్, బెంగుళూరు వాసులే..

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గీతమ్మను పరామర్శస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - రామచంద్రాపురం (పాకాల)

పిల్లలకు సెలవులు కావడంతో వేసవి సెలవుల్లో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేశారు. శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. అయితే అతి వేగమే ప్రాణం తీసిందా? లేదా ఇంకేమైనా కారణం ఉందో..విచారణలో తేలాల్సి ఉంది. శుక్రవారం సాయంత్రం బెంగుళూరులో బయల్దేరిన వీరు, తమిళనాడు రాష్ట్రం హోసూరులో త్యాగరాజన్ కుటుంబీకులను కలుపుకుని శ్రీవారి దర్శనార్థం విచ్చేశారు. శని, ఆదివారాల్లో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం సోమవారం తిరుగు ప్రయాణం అయ్యారు. వీరంతా బంధువర్గమేనని తెలుస్తోంది. వేగంగా వచ్చిన కారు వేరే వాహనాన్ని తప్పించబోయి కంటైనర్ కిందకు దూరిపోవడంతో నుజ్జునుజ్జయ్యింది. ఈ ఘటన చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం నేంద్రగుంట సమీపంలోని కోనప్పరెడ్డిపల్లి వద్ద పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. స్థానికులు గుర్తించి వెంటనే సహాయ చర్యలు చేపట్టారు. పాకాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని, రుయాలో క్షతగాత్రులను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని రుయా వైద్యులను కోరారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఘటన విషయం తెలుసుకుని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతదేహాలను వారి గ్రామాలకు తరలించడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

మృతుల వివరాలు : 1.త్యాగరాజన్ (42), తండ్రి శ్రీనివాసన్, వికాస్‌నగర్, హోసూర్, క్రిష్ణగిరి, తమిళనాడు, 2.విజయలక్ష్మి (50) భార్య సిద్దరాజ్, బెంగుళూరు. 3.సాహన బిఎస్, (34), తండ్రి సిద్దరాజ్, బెంగుళూరు, 4.రజని ఎస్ఆర్ (27), తండ్రి రజనిగౌడ, బెంగుళూరు 5.ఆర్.లేఖన్ గౌడ (11), తండ్రి రంగే గౌడ
క్షతగాత్రులు : 1. క్రిస్విన్ (6) త్యాగరాజన్, తమిళనాడు, 2. గీతమ్మ (51), రంగేగౌడ భార్య, కర్నాటక

నగరవనాన్ని పరిశీలించిన చలపతిరావు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

నగరవనంలో వనరుచి క్యాంటీన్ (కేఫ్టేరియా) ఏర్పాటుకు అటవీ శాఖ అధికారులు చెట్లను తొలగించిన సంఘటనపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో విచారణ అధికారిగా నియమితులైన పిసిసిఎఫ్ (ఉత్పత్తి) చలపతిరావు సోమవారం ఉదయం కపిలతీర్థం వద్ద ఉన్న నగరవణాన్ని పరిశీలించారు. నగర వనంలో చెట్లు తొలగించిన ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించారు. ఈ ప్రదేశంలో గతంలో టీటీడీకి సంబంధించిన నర్సరీ ఉండేదని, అటవీ శాఖకు బదలాయింపు జరిగిన తర్వాత ఈ ప్రాంతంలో మొక్కలు విరివిగా పెంచారన్నారు. అయితే అటవీ శాఖ సిబ్బంది కోసం, పర్యాటకుల కోసం కూడా నగర వనంలో వసతుల కల్పనలో భాగంగా ఈ కెఫ్టేరియా ఏర్పాటు జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. గతంలో నర్సరీ ఉన్న ప్రాంతంలోనే నిర్మాణం జరుగుతోందని, కాకపోతే కెఫ్టేరియా నిర్మాణంలో భాగంగా మరికొంత భూభాగంలో చెట్లను తొలగించినట్లు గుర్తించామన్నారు. తురాయి, పచ్చ తురాయి, రావి, చిన్నపాటి వేప చెట్లను తొలగించినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. అధికారులతో సమావేశమై వారి వివరణ సేకరించిన అనంతరం తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు.

'ఏనుగుల' నియంత్రణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏనుగుల దాడుల నియంత్రణకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని తిరుపతి జిల్లా సిసిఎఫ్ సెల్వం తెలిపారు. సోమవారం సాయంత్రం సిసిఎఫ్ కార్యాలయంలో ఈ మేరకు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏనుగుల దాడులతో మరణాలు సంభవిస్తున్నాయని, వీటిని అరికట్టడానికి, పంట నష్టాన్ని నియంత్రించడానికి ఈ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు జరిగిందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ టాస్క్ ఫోర్స్‌కు హెడ్ గా తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ వ్యవహరిస్తారన్నారు. తిరుపతి జిల్లా, చిత్తూరు జిల్లాలోని భాకరాపేట, పనభాకం, తిరుపతి రెంజి, చిత్తూరు ఈస్ట్, చిత్తూరు వెస్ట్ రేంజ్ లలో ఏనుగుల దాడుల నుండి స్థానిక ప్రజలను కాపాడడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ పనిచేస్తుందన్నారు. ఒక్కొక్క రేంజిలో 10 మంది ఎలిఫెంట్ ట్రాకర్స్ ఉంటారని, వీరు ఆయా గ్రామాల పరిధిలో ఏనుగుల సంచారాన్ని గుర్తించి స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తారన్నారు. ప్రభుత్వ విభాగాల సమన్వయం కోసం విద్యుత్ శాఖ, పంచాయతి రాజ్ విభాగాలతో సంయుక్తంగా ఈ టాస్క్ ఫోర్స్ పనిచేస్తుందన్నారు. టాస్క్ ఫోర్స్ లో ఐదు మంది రేంజి ఆఫీసర్లతో పాటు ముగ్గురు డిఎఫ్ఓలు, ఎన్జీవోల నుంచి బయాలజిస్ట్ రాకేష్ ఇందులో సభ్యులుగా ఉంటారన్నారు. గ్రామాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసే స్మార్ట్ వర్చువల్ ఫెన్సింగ్ ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు ఏనుగుల సంచార ముందస్తు సమాచారాన్ని చేరవేయవచ్చున్నారు. సౌర విద్యుత్తు ద్వారా పనిచేసే ఈ నూతన టెక్నాలజీ జిఎస్ఎమ్ సిమ్ ద్వారా ఏనుగుల కదలికలను బట్టి తిరుపతిలో ఏర్పాటు చేయబోయే కమాండ్ కంట్రోల్ రూమ్ కు సమాచారం చేరవేస్తుందన్నారు. ఈ సమాచారంతో ఆయా గ్రామాల ప్రజలను సురక్షితంగా ఉంచడానికి వీలు అవుతుందన్నారు. గ్రామస్తులు ఏనుగుల గుంపును చూస్తే వెంటనే సంబంధిత అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని, స్వీయంగా ఎటువంటి దూకుడు నిర్ణయాలు తీసుకోవద్దని సూచిస్తున్నామన్నారు. ఏనుగుల గుంపు కనపడితే టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 5909, తిరుపతి డిఎఫ్ఓ 9440810069, చిత్తూరు డిఎఫ్ఓ 9440810113, తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ 9440810070, పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ 9440810114 కు సమాచారం ఇవ్వాలన్నారు.

సిసిఎఫ్ సెల్వం వెల్లడి

శాంతి భద్రతల పరిరక్షణకు సోలార్ కెమెరాలు : ఎస్‌పి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

శాంతి, భద్రతల దష్ట్యా తిరుపతి నగరంతోపాటు జిల్లాలో వివిధ ప్రదేశాలలో అమర్చేందుకు 10 లక్షల విలువైన 150 సోలార్ కెమెరాలను కొనుగోలు చేశామని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తెలిపారు.తిరుపతిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోలార్ కెమెరాలు సౌర శక్తితో పనిచేస్తాయని, ఇవి పర్యావరణానికి అనుకూలంగా ఉండటంతో పాటు చాలా అడ్వాన్స్ ఫీచర్స్ కలిగి ఆడియో, వీడియో ఉంటుందన్నారు. సోలార్ కెమెరాలకు విద్యుత్ అంతరాయం ఉండదన్నారు. సౌర శక్తితో పని చేస్తాయని, విద్యుత్తు లేని ప్రాంతాల్లో కూడా ఈ కెమెరాలు ఏర్పాటు చేసుకునే సౌకర్యంగా ఉంటుంది. వైర్లెస్ కనెక్టివిటీతో ఉంటుందని, స్మార్ట్ ఫోనులో మనం ఎక్కడ ఉన్న పర్యవేక్షించవచ్చున్నారు. ఇది మొబైల్ సిమ్ కార్డు ఆధారంగా పనిచేస్తుందన్నారు. ప్రధానంగా తిరుమలలో శాంతిభద్రతల దష్ట్యా 20 సోలార్ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరుపతి, చంద్రగిరి ఇతర ముఖ్య ప్రాంతాల్లో అత్యాధునిక టెక్నాలజీ కలిగిన సోలార్ సిసి కెమెరా అమర్చేందుకు ఎర్పాట్లు చేస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ పి కె. రావిమనోహరచారి, సీఐలు సాదిక్ ఆలీ, వినోద్ కుమార్, ఈశ్వర్, ఆర్ ఐ రమణారెడ్డి పాల్గొన్నారు.

రూ. 2.5 కోట్ల విలువైన ఎర్రచందనం స్వాధీనం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి అటవీ ప్రాంతంలో 72 ఎర్రచందనం దుంగలతో పాటు ఒక లారీ, ఒక కారు స్వాధీనం చేసుకుని, ఏడుగురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ జి. బాలిరెడ్డి మార్గనిర్దేశకత్వంలో ఆర్ఐ సాయి గిరిధర్ కు చెందిన ఆర్ ఎస్ ఐ సి. వినోద్ కుమార్ టీమ్ ఆదివారం శ్రీకాళహస్తి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టింది. ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లు తనిఖీ చేసి కాటూరు ఫారెస్ట్ బీటు పరిధిలో పంగూరు మెయిన్ రోడ్డు దొమ్మరపాళెం వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. సోమవారం ఉదయం ఒక కారు, దాని వెనుక ఒక లారీ కొద్ది దూరం లో ఆపి, అందులోని వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు వారిని చేరుకుని చుట్టుముట్టారు. లారీని పరిశీలించగా అందులో 72 ఎర్రచందనం దుంగలు కమీపించాయి. వాటి విలువ సుమారు రూ. 2.5కోట్లు ఉంటుందని అంచనా వేశారు. వాహనాల్లో ఉన్న వారిని అరెస్ట్ చేయగా వారిలో నలుగురు తిరుపతి జిల్లాకు చెందిన వారు గాను, మరో ముగ్గురిని తమిళనాడు వాసులుగా గుర్తించారు. వారిని ఎర్రచందనం దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. డీఎస్పీలు వీ. శ్రీనివాసులురెడ్డి, షరీఫ్ లు విచారించగా సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఎఫ్ఐ మోడల్ ఈఎపిసెట్, నీట్‌కు విశేష ఆదరణ

ప్రజాశక్తి - క్యాంపస్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 26-28 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన మోడల్ ఈఎపి సెట్, నీట్ కు వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారని, ఈ పరీక్షలకు విద్యార్థుల నుంచి మంచి ఆదరణ లభించిందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి తెలిపారు. ఎంపీసీ / బైపీసీ స్ట్రీమ్ లలో పేపర్ చాలా బాగుంది అని, పబ్లిక్ ఈఎపిసెట్ లో మంచి ర్యాంక్స్ తెచ్చుకోడానికి చాలా ఉపయోగ పడుతుందని, తిరుపతిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో 4 రోజులపాటు ఈఎపిసెట్ నిర్వహించుకోడానికి అవకాశం ఇచ్చిన ప్రిన్సిపాల్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలు కోసం పోరాడటంతో పాటు విద్యార్థుల మెరుగైన విద్యలో రాణించడానికి ఎల్లప్పుడూ తోడ్పాటు ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, బాబ్జి, జిల్లా ఉపాధ్యక్షులు తేజ, డేవిడ్ పాల్గొన్నారు.



ఏసీబీకి చిక్కిన శ్రీకాళహస్తి సర్వేయర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ల్యాండ్ కన్వర్షన్ కోసం ఐటీఐ కాలేజీ ఛైర్మన్ కంజి చంద్రశేఖర్‌రెడ్డి నుంచి రూ. 25 వేలు లంచం తీసుకుంటూ శ్రీకాళహస్తి రెవెన్యూ కార్యాలయ సర్వేయర్ పురుషోత్తం సోమవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఆ వివరాలను ఏసీబీ విభాగం అడిషనల్ ఎస్పీ విమలా కుమారి మీడియాకు వివరించారు. పట్టణంలోని పానగల్ ప్రాంతంలో ఓ ప్రైవేటు ఐటీఐ కాలేజీ నడుపుతున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డికి విశాలాక్షి నగర్ లో 75 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేయమని ఫిబ్రవరి 22వ తేదీ నుంచి శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. రెండు పర్యాయాలూ దరఖాస్తును అధికారులు తిరస్కరించడంతో విషయం తెలుసుకునేందుకు చంద్రశేఖర్ రెడ్డి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఈ విషయంపై డీటీ ప్రేమ్ కుమార్ ను వివరణ కోరగా మీ ఫైలు సర్వేయర్ దగ్గర ఆగిందంటూ సమాధానం ఇచ్చారు. దీంతో సర్వేయర్ పురుషోత్తం దగ్గరికి వెళ్లి ఆరాతీయగా రూ.30 వేలు లంచం ఇస్తేనే ఫైలు ముందుకు వెళుతుందని సమాధానం ఇచ్చాడు. లంచం ఇవ్వడం ఇష్టంలేని చంద్రశేఖర్ రెడ్డి విషయాన్ని ఏసీబీకి ఫిర్యాదు చేశారు. వారి సూచనల మేరకు సర్వేయర్ కు రూ.25 వేలు లంచం ఇచ్చేందుకు అంగీకరించాడు. ఆ మేరకు చంద్రశేఖర్ రెడ్డి నుంచి రూ.25 వేలు లంచు తీసుకుంటుండగా సర్వేయర్ పురుషోత్తంను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో ముమ్మర తనిఖీలు చేశారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ ప్రశాంతి, సిఐ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విరాళం ఇవ్వలేదని...గుడికి రావద్దన్నారు!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వారడిగినంత విరాళమివ్వనందుకు రామాలయ నిర్వాహకులు తమను రావొద్దంటున్నారని తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలి పంచాయతీ కొత్తకన్నలి గ్రామానికి చెందిన ఓ బాధిత కుటుంబం సోమవారం మీడియా ఎదుట వాపోయింది. బాధితురాలు సుందరమ్మ కథనం మేరకు.. ఇటీవల నిర్వహించిన శ్రీరామనవమి ఉత్సవాలకు సుందరమ్మ కుటుంబం నుంచి 9 వేలు విరాళమివ్వాలని నిర్వాహకులు అడిగారు. అయితే తాను ఇబ్బందుల్లో ఉన్నాననీ, అందరూ ఇచ్చినట్లుగానే ఇంటికి రూ.3500 చొప్పున మాత్రమే ఇవ్వగలనని నచ్చ చెప్పి ఇచ్చింది. అయితే ఆ మొత్తాన్ని నిర్వాహకులు సుందరమ్మ కుటుంబానికి తిరిగి ఇచ్చేశారు. అయితే ఉత్సవాలు ముగిసిన అనంతరం తమను రామాలయంలో పూజలు చేసుకోనీకుండా అడ్డుకుంటున్నారనీ, రానివ్వకుండా తాళాలు వేస్తున్నారని బాధితురాలు, ఆమె కుమార్తె సుభాషిణి, అల్లుడు వాపోయారు. తమకు అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు.

పట్టించుకుని.. పరిష్కరించండి : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

'కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారుల సమస్యలు పట్టించుకుని, గడువులోపు పరిష్కరించాలి' అని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తో పాటుగా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులుతో కలసి వెనుకలు స్వీకరించారు. వేసవి దష్ట్యా ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో వచ్చిన ప్రతి అర్జీదారుడుకి మంచినీరు, మజ్జిగను అధికారులు పంపిణీ చేయించారు. మొత్తం అర్జీలు 285 రాగా అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 145 వచ్చాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్ తదితరులు పాల్గొన్నారు.

స్మశానానికి దారి కల్పించండి
గురవయ్య, పర్యావరణ చైతన్యవేదిక అధ్యక్షులు

వడమాలపేట మండలం టిసి అగ్రహారం రెవిన్యూ లెక్క దాఖలా లక్ష్మమ్మ కండ్రిగ పంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 148/14లో 50 సెంట్లు గల అగ్రహారం హరిజనవాడ స్మశాన వాటిక ఉంది. శవాన్ని తీసుకు వెళ్లాలంటే రైతుల పొలాలపై వెళ్లాల్సి వస్తుందని, అది వారి దయాదాక్షిన్యాలపై ఆధారపడి ఉంటుంది. కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించి ఈ స్మశాన వాటికకు దారి కల్పించాలి.

తిరుచానూరు ఎస్ఐ సాయినాథ్ చౌదరి పై చర్యలు తీసుకోవాలని ఐద్వా ఆధ్వర్యంలో కలెక్టర్ ఫిర్యాదు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 285 అర్జీలు

ఉద్యోగ భద్రత కల్పించాలి : సౌమ్య, ఉపాధ్యక్షులు, ఎపి మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ అసోసియేషన్

ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలి. ఎన్నో ఏళ్లుగా మారుమూల గ్రామాలలో వైద్య సేవలను నిరంతరాయంగా అందిస్తున్నాము. ప్రభుత్వం సూచించే సర్వేలను ఎంతో నాణ్యతగా చేస్తూ ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నాం. మా డిమాండ్ల సాధన కోసం ఇప్పటికీ ఎన్నిసార్లు విన్నవించిన పెడచెవిన పెడుతున్నారు. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలతో సతమతమవుతున్న మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. ఎన్హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరపాలి. ఈపీఎఫ్ఓ ను పునరుద్ధరించాలి. క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లిస్తూ క్రమబద్ధీకరించాలి. ఎఫ్ ఆర్ ఎస్ నుంచి సిహెచ్ఓ లను మినహాయింపు ఇవ్వాలి.

మా పాఠశాలను ఉన్నతీకరించండి
నరసింహాచారి, 25వ డివిజన్ కార్పొరేటర్

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని 25వ డివిజన్లో ఉన్న పాఠశాలను ఉన్నతీకరించండి. విద్యార్థుల సౌలభ్యం కోసం నగరపాలక సంస్థ నుండి 15 లక్షల రూపాయలతో అదనపు గదులను నిర్మించుకున్నాం. వేరొక పాఠశాలకు విలీనం చేస్తే పిల్లలు అక్కడికి వెళ్ళడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పిల్లల భద్రత దష్ట్యా నిర్ణయం తీసుకోవాలి.

అనుకూల వాంగ్మూలం చెప్పాలని తీవ్రంగా కొట్టారు
హేమలత, సుందరయ్యనగర్

మంగళం పరిధిలోని కష్ణవేణి యాదవ్ కాలనీలో జరిగిన భూ క్రయవిక్రయాలకు సంబంధించి మధ్యవర్తిగా వ్యవహరించిన నన్ను పోలీసులు తమకు అనుకూల వాంగ్మూలం ఇవ్వాలని తీవ్రంగా కొట్టారు. రిటైర్డ్ ఎస్సై వెంకటరమణ కుమారుడు గంగాధర్ ఆయన ఇష్టానుసారమే ఇళ్లను అమ్మి సొమ్ము చేసుకున్నాడు. అయితే నేడు క్రయవిక్రయాల్లో తక్కువ డబ్బు ఇచ్చినట్టుగా చెప్పాలని మధ్యవర్తిగా వ్యవహరించిన నన్ను పోలీసుల నుండి కొట్టిస్తూ ఒత్తిళ్లు చేస్తున్నారు. పోలీసులు నా వద్ద నుండి డబ్బులు, సెల్ ఫోను తీసుకొని ఇన్ని రోజులు అవుతున్నా ఇప్పటికీ తిరిగి ఇవ్వలేదు. తీవ్రంగా కొట్టిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకొని నా డబ్బు, సెల్ఫోన్ తిరిగి ఇవ్వాలి.

జయరామ్ చౌదరి అరెస్టుకు కృతజ్ఞతలు
పి.హేమలత, ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఐదు సంవత్సరాలుగా రైతులకు చెల్లించాల్సిన చెరకు బకాయిల చెల్లించకుండా అదశ్యమైన జయరామ్ చౌదరిని ఎట్టకేలకు అరెస్టు చేసినందుకు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. హేమలత కృతజ్ఞతలు తెలిపారు. అతని ఆస్తులను జప్తు చేసి, రైతులకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించాలని కలెక్టర్‌కు విన్నవించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 45 వినతులు.

తిరుపతి టౌన్ : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 45 వినతులు వచ్చాయని డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికష్ణ, కార్పొరేటర్లు ఎస్.కె.బాబు, ఆరని సంధ్య, అనిల్ కుమార్ విచ్చేసి తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి ఉన్నారు.

తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో...

హోరాహోరీగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

పట్టణంలోని పుత్తూరు కోర్టు ఆవరణలో హోరాహోరీగా బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం జరిగాయి. అధ్యక్షులుగా కె.పురుషోత్తం, గాలి సురేష్, కార్యదర్శిగా రాజేష్, ఎల్.భాస్కర్‌రావు బరిలో నిలిచారు. మాడ శ్రీనివాసులు, శివప్రసాద్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. మొత్తం 106 మంది ఓటర్లు ఉన్నాయి. మొత్తం 86 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షులుగా గాలి సురేష్, కార్యదర్శిగా రాజేష్, ఉపాధ్యక్షులుగా గాయత్రి, ఉప కార్యదర్శిగా దినకర్, ట్రెజరర్‌గా జానకిరామ్, మహిళా సహాయకులుగా నదియా, లైబ్రరీగా దొరబాబు, స్పోర్ట్స్ కార్యదర్శిగా ఎన్.రామ్మూర్తి గెలుపొందారు. ఈ కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, మురళిరెడ్డి, విజయ్‌కుమార్, రాజారెడ్డి, ఉదయ్‌కుమార్, కేజీ ప్రభాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, శేషాచలం పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందింది వీరే..

ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశానికి ఉత్తర్వులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: విద్యాహక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, బుచ్చినాయుడు కండ్రిగ మండల విద్యాశాఖ అధికారులు రవీంద్రనాథ్, ముని సుబ్రహ్మణ్యంలు తెలియజేశారు. ఒకటవ తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ కొన్ని అనివార్య కారణాల వల్ల మే 2 నుండి మే 19 వరకు మార్పు చేసినట్లు సమగ్ర శిక్షా ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఆర్.వి.రావు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 316–జె కి గూడూరు నుండి గత 30 సంవత్సరాల తరువాత 2025–26 సంవత్సరానికి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఎంపికైన లయన్ ఆర్వీ రావు (రావల వెంకటేశ్వర్లు)ను గూడూరు, హోటల్ మహేంద్ర ఎలైట్ ఫంక్షన్ హాల్లో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం గూడూరులోని మూడు లయన్స్ క్లబ్బులు కలిసి నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ జనార్దన్ రెడ్డి విచ్చేశారు. అనంతరం ఉచిత కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి చెంచు రామయ్య, రూపేష్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

ప్రజాశక్తి – గూడూరు టౌన్ గూడూరు, పురపాలక సంఘ కార్యాలయంలో పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు సమావేశం నిర్వహించారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి ముందుగానే పన్నులు చెల్లిస్తే ప్రభుత్వం 5 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పాత బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ కల్పించిందని, ఈ అవకాశం ఏప్రిల్ 30వ తేదీ వరకు మాత్రమే నని వెల్లడించారు. పట్టణ ప్రజలందరూ పన్ను బకాయిలను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మహిళా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శ్రీ చైతన్య పాఠశాల ఆవరణంలో ప్రగతి సేవ సంస్థ అనుబంధ సంస్థ సౌర్యంలో మహిళ ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రగతి సేవ సంస్థ అధ్యక్షుడు కవితేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ వేసవి ఆట విడుదులో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవ సంస్థ కార్యవర్గ సభ్యులు, టీచర్ మామదూరు రాధయ్య, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీహరి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టూ టౌన్ సిఐగా నాగార్జున రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి టూ టౌన్ సిఐగా నాగార్జున రెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ సిఐగా పనిచేస్తున్న వెంకటేశులు తిరుపతి విఆర్‌కు వెళ్లారు. తిరుపతి విఆర్ నుండి నాగార్జున రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు. నాగార్జున రెడ్డికి గతంలో వన్ టౌన్ సిఐగా పనిచేసిన అనుభవం ఉంది. కోవిడ్ కాలంలో ఆయన సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందించారు. టూ టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టడంపై పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడకుండా సేవలందించనున్నట్లు నాగార్జునరెడ్డి తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మహిళల ఆర్థికాభివృద్ధితోనే కుటుంబం అభివృద్ధి పథంలో నడుస్తుందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళలు తమ సొంత కాళ్లపై నిలబడేందుకు టైలరింగ్ శిక్షణ ఎంతగానో దోహదపడు తుందన్నారు. ఇప్పటికే శ్రీకాళహస్తి ప్రాంతంలో 600కు పైగా కుట్టు మిషన్లు మహిళలకు అందజేశామని, శిక్షణ పొందిన ప్రతి ఒక్కరికీ మెషీన్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్‌లు పాల్గొన్నారు.

కొమ్మా ఎల్లమ్మకు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం పరిశోధక విద్యార్థిని కొమ్మా ఎల్లమ్మకు వర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసినట్లు ఎస్వీయు పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీప్ స్టడీస్ విభాగం ఆచార్యులు జి విజయ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో "ఎ హిస్టారికల్ స్టడీ ఆఫ్ ఫెమినిస్ట్ మూమెంట్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ " అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. ఎల్లమ్మకు డాక్టరేట్ రావడంపై పలువురు అభినందనలు తెలిపారు.

ఎస్వీయు డిగ్రీ పరీక్షల్లో స్వల్ప మార్పు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో స్వల్ప మార్పు జరిగింది. 30/4/2025 తేదీన జరగవలసిన పరీక్ష 15/5/2025 తేదీ నిర్వహించ బోతున్నట్లు ఎస్వీయూ పరీక్షల నియంత్రణాధికారి రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో జరుగు తున్న పాలిటెక్నిక్ ఎంట్రన్స్–2025 పరీక్ష కారణంగా ఈ పరీక్ష వాయిదా వేస్తున్నామని ఆయన తెలిపారు. డిగ్రీ విద్యార్థులు ఈ మార్పును గమనించి పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - చిల్లకూరు : మండల కేంద్రం, చిల్లకూరు గ్రంథాలయంలో సోమవారం విద్యార్థినీ విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉపాధ్యాయులు ఎం.లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లైబ్రేరియన్ వి.నాగేంద్ర రావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

'వేమన విజ్ఞానకేంద్రం' లో సమ్మర్ హంగామా

ప్రజాశక్తి - తిరుపతి సిటి : పాఠాలతో విసిగిపోయిన పిల్లలు వేసవి సెలవుల్లో సెల్ మాయాజాలంలో పడకుండా ఆటపాటలతో అలరించేలా వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'సమ్మర్ హంగామా' ప్రారంభించారు. మానసిక, శారీరక ఒత్తిడిని తట్టుకుని, చదువులంటే ఇష్టంగా చదివేలా ఆటలు, పాటలు, డ్యాన్స్‌లు, నీతి కథలతో ఎంజాయ్ చేసేలా సమ్మర్ క్యాంపు నిర్వహించారు. శాస్త్రీయ ఆలోచనలను పెంచి, మూఢనమ్మకాలకు దూరంగా ఉండేలా, కులమతాలకు అతీతంగా స్నేహపూర్వకంగా ఉంటేనే శాంతి నెలకొని సమాజం అభివృద్ధి చెందుతుందని అవగాహన కల్పించారు. డ్రాయింగ్, మ్యాథ్స్‌లో మెళకువలు, గుండ్రటి చేతివ్రాత మెళకువలు, స్పోకెన్ ఇంగ్లీష్, కర్రసాము, క్లాసికల్ డ్యాన్స్ నేర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, టెంకాయల దామోదరం, నడ్డినారాయణ, విశ్రాంత బిఎస్ఎన్ఎల్ జిఎం వెంకట నారాయణ, బాలాజీ చౌదరి, జయరాం, మునిరాజు, రుయా ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, గురునాథం, రఫీ, అర్చన, భాస్కర్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎ ఐక్య ప్యానల్ విజయం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఏఐఎస్ఎ ఐక్య ప్యానల్ విజయం ఉన్నత విద్యా హక్కులపై మతోన్మాద దాడులకు మరోసారి చరిత్రాత్మక సమాధానం చెప్పినట్లయిందని ప్యానల్ సభ్యులు అన్నారు. శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆ సంఘం నేతలు రంజిత్ కుమార్, చిన్నలు మాట్లాడుతూ ఉద్యమాల పురిటి గడ్డ జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి ఎన్నికల్లో ఏఐఎస్ఎ–డిఎస్ఎఫ్ ఐక్య ప్యానల్ 2025 ఘన విజయం సాధించిందన్నారు. ఏఐఎస్ఎ విద్యను వ్యాపారంగా మార్చే కుట్ర విఫలమయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణు, వంశీకృష్ణ, శీను శ్రీరాములు, అశోక్‌లు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఉద్యోగోన్నతులు కల్పించాలి

రిలే నిరాహార దీక్షలో పుత్తూరు ఆర్‌టిసి డిపో ఉద్యోగులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆర్టీసీఉద్యోగులకు గత నాలుగు సంవత్సరాలుగా ఆగిన పదోన్నతులను వెంటనే కల్పించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు డి.వి.ఆర్ కుమార్, డిపో అధ్యక్షులు ఎస్ సుందరంలు డిమాండ్ చేశారు. వివిధ సమస్యల సాధన కోసం ఎన్ఎంయు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం పుత్తూరు డిపో ప్రాంగణంలో పలువురు ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుల ఎస్.సుందరం మాట్లాడుతూ ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం 1/2019 సర్కులర్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రఘుపతి, వెంకటమణి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

రిలే నిరాహార దీక్షలో సత్యవేడు ఆర్‌టిసి డిపో ఉద్యోగులు

ప్రజాశక్తి - సత్యవేడు: ఆర్టీసీఉద్యోగులకు గత నాలుగు సంవత్సరాలుగా ఆగిన పదోన్నతులను వెంటనే కల్పించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ అధ్యక్షులు పెరుమాళ్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల సాధన కోసం ఎన్ఎంయు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం సత్యవేడు డిపో ప్రాంగణంలో పలువురు ఎంఎంయు ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా రీజనల్ అధ్యక్షులు ఎస్ జె.పెరుమాళ్ మాట్లాడుతూ ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం 1/2019 సర్కులర్ అమలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. అనారోగ్యానికి గురైన ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలన్నారు. గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యోగుల పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు రీజనల్ అధ్యక్షులు ఎస్ జె పెరుమాళ్, డిపో అధ్యక్షులు పార్థసారథిరెడ్డి, వాసుదేవయ్య, గోపాల్, పోలయ్య, విజయన్, గజేంద్రన్, బాలాజీ, గ్యారేజీ అధ్యక్షులు కుప్పయ్య, సుధాకర్, కుమార్, గోపన్న, ఆనందయ్య, ప్రకాష్, వర్మ, కరీములా, వాసులు, వినోద్ కుమార్, వేణు,పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

1/2019 సర్కులర్ అమలుచేయాలి

రిలే నిరాహార దీక్షలో గూడూరు ఆర్‌టిసి డిపో ఉద్యోగులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : 1/2019 సర్క్యులర్ విధిగా అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లను ఆపాలని, గ్యారేజీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎన్.ఎం.యు జిల్లా ట్రెజరర్ మోహన్ డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో సమస్యల పరిష్కారానికై నిర్వహిస్తున్న రిలే దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు జిల్లా జాయింట్ సెక్రెటరీ శ్రవణ్, డిపో ప్రెసిడెంట్ ప్రవీణ్, సెక్రటరీ శ్రీనివాసులు, గౌస్, వెంకయ్య,మల్లికార్జున, వెంకటేశ్వర్లు, పాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారమయ్యే వరకు పోరాటం

రిలే నిరాహార దీక్షలో శ్రీకాళహస్తి ఆర్‌టిసి డిపో ఉద్యోగులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : న్యాయపరమైన డిమాండ్లను పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం ఆగదని ఆర్టీసీ నేషనల్ మజ్దూరు యూనిటీ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సోమవారం శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జీవో 114 ప్రకారం నైట్ అవుట్ అలవెన్సును రూ.150 నుంచి రూ. 400 వరకు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడే ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీలో ప్రయాణాలకు అనుమతించాలనీ, ఉద్యోగుల ఆనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలని కోరారు. పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్పిడిసిఎల్) కార్పొరేట్ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎండి సంతోష రావు మాట్లాడుతూ వేసవి తీవ్రత దష్ట్యా పాదచారుల దాహార్తిని తీర్చేందుకు వీలుగా ఎపిఎస్పిడిసిఎల్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. చలివేంద్రంలో ప్రతిరోజూ చల్లటి తాగునీటితోపాటు మజ్జిగ కూడా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు డిఎస్ వర కుమార్, కె. ఆదిశేషయ్య, పిహెచ్ జానకీరామ్, జనరల్ మేనేజర్ వై.వెంకట రాజు పాల్గొన్నారు.

శ్రీసిటీకి మెరుగైన విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి - సత్యవేడు : ఎస్‌పిడిసిఎల్ తిరుపతి సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో శ్రీసిటీలో పరిశ్రమల విద్యుత్ వినియోగదారుల సదస్సు సోమవారం జరిగింది. పరిశ్రమ వర్గాలు పలు సందేహాలను నివృత్తి చేశాయి. విద్యుత్ సరఫరా అంతరాయాన్ని అరికట్టి, మెరుగైన సరఫరా అందించడంపై పుత్తూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, స్థానిక ఎడిలు, ఎఇలకు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు.

'సొనాటా గోల్డ్' ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: దేశంలో ఎక్కువ మంది అభిమానించే వాచ్ బ్రాండ్ సొనాటా, అద్భుతమైన సొనాటా గోల్డ్ కలెక్షన్‌ను పరిచయం చేసింది. అక్షయ తృతీయ, సమీపిస్తున్న కొద్దీ, సొనాటా గోల్డ్ బంగారు బహుమతిపై ఆధునిక దక్పథాన్ని అంది స్తుంది. ఈ కలెక్షన్ లోని ప్రతి టైమ్‌పీస్ దాని డయల్‌లో అమర్చబడిన నిజమైన తనిష్క్ గోల్డ్ కాయిన్‌ను కలిగి ఉంది. కొత్త కలెక్షన్ గురించి సొనాటా బ్రాండ్ హెడ్ ప్రతీక్ గుప్తా మాట్లాడు తూ 'సొనాటా గోల్డ్ కేవలం వాచ్ కాదు – ఇది ఒక అనుభవం. మేము ప్రీమియం, శాశ్వతమైనప్పటికీ ట్రెండ్ పరంగా ముందు ఉందనిపించేదాన్ని సష్టించా లను కున్నాము. ఈ గడియారాలు డిజైన్‌కు విలువనిచ్చే వారి కోసం తీర్చిదిద్దాం. రూ. 5,695 నుండి రూ. 5,995 మధ్య ధరతో అందుబాటులో ఉంది' అని పేర్కొన్నారు.

విద్యార్థులలో ఏకాగ్రత అవసరం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి రామకష్ణ మిషన్ ఆశ్రమం నిర్వహించిన సంస్కార శిబిరం 2025 సమ్మర్ క్యాంపు సోమవారం వివేకానంద సభంగనలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రెడ్ శాండర్స్ టాస్క్ ఫోర్స్ డిఎస్పీ జి. బాలిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో ఏకాగ్రత అవసరం అని, దానికి యోగా చేయాల్సి ఉంటుందన్నారు. వేసవి సెలవుల్లో శిక్షణ కార్యక్రమాల వల్ల వ్యక్తిత్వ వికాసం పొందవచ్చునని తెలిపారు. వీటి ద్వారా కొన్ని సమస్యలను తమకు తాముగా పరిష్కరించుకునే విజ్ఞానం పెంచుకోవచ్చునని అన్నారు. ఏది జరిగినా మన మంచికే అనే స్వభావాన్ని కలిగి ఉండాలని చెబుతూ నీతి కథలను ఉదహరించారు. భారతీయ విద్యాభవన్ శ్రీవేంకటేశ్వర విద్యాలయం డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఈ శిబిరాలకు హాజరైన విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళ్లారన్నారు. విద్యార్థులకు ఉత్తమ విలువలు అందించాలని రామకష్ణ మిషన్ ప్రయత్నిస్తోందన్నారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రామకష్ణ మిషన్ కార్యదర్శి స్వామి సుకతానంద జి మహరాజ్ మాట్లాడుతూ మిషన్ ను 1897 మే 1న ప్రారంభించారని తెలిపారు. స్వామి వివేకానంద స్ఫూర్తిని కలుగ జేశారని తెలిపారు. 2015 నుంచి వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు శ్రీవారి సేవ జూన్ నెల కోటా విడుదల

ప్రజాశక్తి - తిరుమల: ఏప్రిల్ 30న శ్రీవారి సేవ జూన్ నెల కోటాను టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. జనరల్ శ్రీవారి సేవ ఉదయం 11 గంటలకు, నవనీత సేవ (మహిళలకు) మధ్యాహ్నం 12కు, పరకామణి సేవ (పురుషులకు) 1 గంటలకు, గ్రూప్‌లీడర్ సేవ (కొత్తగా ప్రారంభించారు) మధ్యాహ్నం 2కు విడుదల చేయనుంది.

ఉన్నత లక్ష్యాలు అవసరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే లక్ష్యాలను తప్పనిసరిగా ఎంచుకోవాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన పలువురు శ్రీకాళహస్తి ప్రాంత విద్యార్థులను ఎమ్మెల్యే సోమవారం ఘనంగా సత్కరించి, అభినందించారు.

లింగమనాయుడుపల్లిలో 'ఫీవర్' ఫియర్
పట్టించుకోని వైద్యాధికారులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తిరుపతి జిల్లా, తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లిలో విష జ్వరాలు స్వైర్య విహారం చేస్తున్నాయి. ఒక వైపు ఎండలు.. ఇంకో వైపు విష జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా లింగమనాయుడుపల్లి దళితవాడలో గత పది రోజులుగా విష జ్వరాలు బారినపడి సుమారు 20 మందికి పైగా మంచానపడ్డారు. ప్రయివేట్ ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా వైద్యాధికారుల్లో ఎలాంటి చలనం లేకుండా పోయింది. స్థానికంగా ఉన్న ఆశా వర్కర్లు జ్వరాల నియంత్రణకు ఉడత సాయం చేస్తున్నా, అది ఏ మాత్రం జ్వర పీడితులకు స్వాంతన చేకూర్చడం లేదు. విష జ్వరాల బారిన పడ్డవారు కాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నట్లు చెబుతున్నారు. అంతేకాకుండా ముఖం, కాళ్లు వాయడంతో పాటు ముక్కు వద్ద నల్లటి మచ్చలు వస్తున్నట్లు తెలిపారు. జనాలు జరాలతో అల్లాడిపోతున్నా వైద్యాధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తొట్టంబేడు వైద్యాధికారులు లింగమనాయుడు పల్లిలో వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేసి విష జ్వరాల నియంత్రకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వెంటనే పరీక్షలు నిర్వహిస్తాం
: డాక్టర్ లహరి, వైద్యాధికారిణి, తొట్టంబేడు పీహెచ్సీ

లింగమనాయుడుపల్లి గ్రామంలో వైరల్ ఫీవర్స్ ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. వారం రోజుల కిందట మినీ క్యాంపు నిర్వహించాం. జ్వరాలు పూర్తి స్థాయిలో అదుపులోకి వచ్చేలా శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తాం.

పాకిస్తానీ ముష్కరులను మట్టు పెట్టండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పహల్గామ్ దాడుల్లో భారత పర్యాటకులను అంతమొందించిన పాకిస్తానీ ముష్కరులను మట్టు పెట్టాలని జై భీమ్ ప్రజా సంరక్షణ సమితి అధ్యక్షులు షేక్ కరీముల్లా భారత ప్రభుత్వాన్ని కోరారు. ఉగ్రదాడుల్లో అమరులైన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సోమవారం జై భీమ్ ప్రజా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ముర్దాబాద్ ముర్దాబాద్ పాకిస్తాన్ ముర్దాబాద్, ముర్దాబాద్ ముర్దాబాద్ టెర్రరిజం ముర్దాబాద్, హిందూ ముస్లిం జిందాబాద్, హిందూ ముస్లిం ఏక్ థ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. పాకిస్తాన్ జెండాను చింపి నిరసన తెలిపారు. అబ్దుల్ లతీఫ్, బాబు, మస్తాన్, ఆర్టీసీ జానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అవినీతిని వెలికి తీయండి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం, తొండవాడ పంచాయతీలో గత వైసిపి ప్రభుత్వంలో వైయస్సార్ కాలనీ ఏర్పాటులో జరిగిన అవినీతిని వెలుగులోకి తేవాలని చంద్రగిరి జనసేన పార్టీ సీనియర్ నాయకుడు తపస్సి మురళి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన చంద్రగిరిలో విలేకరులతో మాట్లాడుతూ సమాచార హక్కు 2005 చట్టం ప్రకారం వివరాల కోసం తహసిల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. జగనన్న కాలనీ ఏర్పాటు సందర్భంగా అప్పటి రెవెన్యూ అధికారులు, వైయస్సార్ సిపి నాయకులు పోటీపడి ప్రత్యేకంగా అదే పంచాయతీకి చెందిన వైయస్సార్ సిపి నాయకుడు కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారని, లేని భూమిని సైతం రికార్డులో ఉన్నట్లుగా చూపించి లబ్ధి పొందినట్లు ఆరోపించారు. కేటగిరీలు మార్చి ప్రభుత్వ ఖజానాకు భారీ స్థాయిలో గండి కొట్టి వెనకేసుకొన్నారన్నారు. అంతా తానై వ్యవహరించిన సదరు నాయకుడుకి 22 ఎకరాలకు సంబంధించి కమీషన్ చేరలేదని రైతులను బెదిరిస్తున్న ఆడియో సోషియల్ మీడియాలో హలచల్ చేసిందన్నారు. కాలనీ ఇల్లు మంజూరై ఆర్థిక సోమత లేక ఇల్లు కట్టుకోలేక ఖాళీగా ఉంటున్న స్థలాన్ని అధికారులు, సదరు నాయకుడు కలిసి ఇతరులకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు ఇస్తూ ఇద్దరు పేదలను మోసగించారని మురళి ఆరోపించారు. అప్పట్లో అధికారం లేక ఎదిరించలేని ప్రతిపక్ష పార్టీ అయిన తెలుగుదేశం ప్రస్తుత అధికారములోకి వచ్చిన తర్వాత అయినా ఈ అవినీతిపై నోరు మెదపకపోవడంపై

వైద్యుల కొరత తీర్చండి

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యుల కొరతను తీర్చాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లును కోరారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయానికి, సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, అనస్తీషియా వైద్య నిపుణుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీనికి తోడు మరో సీనియర్ డాక్టర్‌ను పుత్తూరుకు బదిలీ చేయడం దారుణమన్నారు. ఇవేకాక మండలంలో ఖాళీగా ఉన్న తహశీల్దారు పోస్టును భర్తీ చేయాలని, సత్యవేడు టిటిడి కళ్యాణ మండపం నిర్మాణంపై తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. నాగలాపురం – చిన్న పాండూరు మధ్య రోడ్డు అద్వాన స్థితిలో ఉందని కనీసం తాత్కాలికంగా అయిన మరమ్మత్తు పనులు చేపట్టాలని కోరారు.

THE COURT OF TIIE JUNIOR CIVIL JUDGE: PUTTAPARTHY
O.S No:83/2023

Between:
A.Sai Kumar ...**Plaintiff**
V/S
Defendant: G. Srinvasulu (Barber) S/o G. Nallappa, aged about 43 years, Krishnapuram Village, Bukkapatmuandal, Sri sathya Sai District. Cell: 8790060279 ...**Defendant**

ప్రతివాదికి దావా సమను

పై దావాలో వాది దావాలో కనబరిచిన బాకీ రాబట్టుటకు గాను నీ మీద దావా దాఖలు చేసియున్నది.సదరు దావా నీ యొక్క హాజరు నిమిత్తం తేది:07–05–2025 నాటికి వాయిదా వేసియున్నారు. ఈ దినము పై కోర్టు ఎదుట ఉదయం 10:30 గంటలకు వకీలు ద్వారా గాని లేద సొంతంగా గాని హాజరై నీ యొక్క అభ్యంతరములు తెలుపుకోగలరు. లేనిచో పై దావాను మీ పరోక్షమందు తీర్మానం కాగలరు.

Date of Hearing: 07-05-2025

Challa Chandra Sekhar,
Advocate Puttaparthy
Cell: 9441518908.

గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
SOP. No. 79 / 2025.

1. Burra Chandravathi
2. Kandalam Deepak
3. Kandalam Vyshnavi ...Petitioners

Vs.

Nil ...Respondent

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా కిరీటి కందలం S/o దొరస్వామి గారు గూడూరు మాలవ్యనగర్ పోస్ట్ ఆఫీస్ నందు దాచి ఉంచిన డబ్బులను కిరీటి కందలం గారి మరణనంతరం పై నెంబరులోని పిటీషనర్లు వారసులుగా నిర్ణయించి పై నెంబరులోని పిటీషనర్లు పేరుతో వారసత్వపు సర్టిఫికెట్ కొరకు పై నెంబరు పిటిషన్ దాఖలు చేసినందున ఎవరికైన ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల తేది.18–06–2025న పై కోర్టు ఎదుట ఉదయం 10.30 గం॥లకు హాజరై తెలుపుకోవలసినది. లేనియెడల ఆక్షేపణలు లేనట్లుగా తీర్మానం చేయుదరని తెలియజేయడమైనది.

ఇట్లు
కురుచర్లపాటి పురంధర్ కుమార్,
పిటీషనరు తరపు న్యాయవాది,
గూడూరు. సెల్ : 9849286179

మహారాజశ్రీ తిరుపతి 10వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జిగారి కోర్టులో
గార్డియన్ ఓ.పి.నెం.134/2025

1) టి.శశిప్రియ భర్త వి.శంకర్ రెడ్డి 2) మైనర్ వంకిరెడ్డి హాసిక మైనర్‌కి గార్డియన్ టి.శశిప్రియ భర్త వి.శంకర్ రెడ్డి ...పిటీషనర్లు

V/s

నిల్ ...రెస్పాండెంట్స్

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా! మైనర్ వంకిరెడ్డి హాసిక మైనర్‌గా ఉన్నందున తల్లి టి.శశిప్రియ తేది. 13.08.2018న ఎం.సుబ్బమ్మకు GPA హోల్డర్ వి.శంకర్ రెడ్డి ద్వారా తిరుపతి రూరల్ (మం॥), తుమ్మలగుంట గ్రామ లెక్కదాఖలా సర్వే నెం. 48/4ఎ నందు తూ–ప 28 అ॥, ఉ–ద 26 అ॥ వెరశి 728 చ॥అ॥ డాక్యుమెంట్ నెం. 3433/2018 అను విక్రయ పత్రము ద్వారా గార్డియన్ తరపున 1వ పిటీషనర్ విక్రయించుకొని సదరు తేది నుండి తన స్వాధీనానుభవంలో ఉంచుకొన్నది. సదరు టి.శశిప్రియ గారు నర్స్‌గా తిరుపతిలో పనిచేస్తూ... వృత్తిరీత్యా కర్నూలుకు ట్రాన్స్‌ఫర్ అయి ప్రస్తుతం కర్నూలులో నివాసం మరియు జీవనం సాగిస్తూ... సదరు పిటీషనర్లు కర్నూలులో ఉన్నందున తిరుపతి రూరల్, తుమ్మలగుంట నందు గల సదరు షెడ్యూలును అనుభవించుకోలేకపోతున్నారు. సదరు మైనర్ చదువులకు మరియు సదరు సైట్ అమ్మగా వచ్చిన పైకముతో వాళ్ళ పెద్దవాళ్ళు వుండే ఊర్లలో చంద్రగిరి మండలం, కొట్టాల గ్రామ లెక్కదాఖలా నందు మరియు యర్రావారిపాళెం మండలం నందు సదరు మైనర్ పేరుతో భూములు కొనదలచియున్నది. కావున సదరు GOP షెడ్యూలును ఎవ్వరికైనా అమ్మి వేయుటలో ఎవరికైన ఏలాంటి అభ్యంతరములు ఉన్నయెడల 9.05.2025 తేదీ పై కనిన కోర్టుకు ఉదయం 10 గం॥ నేరులోగాని లేక వకీలు ద్వారా హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలసినది. లేనియెడల మీ పరోక్షముగా తీర్మాణించబడును.

వాయిదా తేది. 09.05.2025
మాలే హరిప్రసాద్, పిటీషనర్ల తరపున న్యాయవాది, తిరుపతి

క్రైం న్యూస్

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు
6 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గంజాయి విక్రయించేందుకు తరలిస్తున్న వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. గూడూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఇన్స్పెక్టర్ ఎస్ కే కరీమా బేగం, సిబ్బందితో కలిసి పట్టణంలోని బస్టాండ్, రైల్వే స్టేషన్లు తనిఖీ చేస్తుండగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వినాయకుడి గుడి వద్ద అనుమానంగా సంచరిస్తున్న సెల్వ కుమార్ మోహన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. అతని వద్ద నుంచి ఆరు కేజీలు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతను నర్సీపట్నంలో కొనుగోలు చేసి తమిళనాడు రాష్ట్రంలో సేలం జిల్లా చెట్టిపట్టులో విక్రయించేందుకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరపరిచినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఏ.శేషమ్మ, హెడ్ కానిస్టేబుల్ ఏ.చెంచయ్య, కానిస్టేబుల్ టి.నారాయణయ్య, మనోహర్, ఎం రవి, తదితరులు పాల్గొన్నారు.

బంగారు నగల చోరీ

బీరువా తెరచిఉన్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధి, చింపిరి నాయుడు కాలువ ప్రాంతంలో ఉన్న ఓ ఇంట్లో బంగారు నగ చోరీ గుర్తైన సంఘటన చోటుచేసుకుంది. గూడూరు రెండో పట్టణ సిఐ శ్రీనివాస్ కథనం మేరకు చింపిరి నాయుడు కాలువ ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగిందన్నారు. వెంకటేశ్వర్లు తమ బంధువుల ఇంటికి వెళ్ళాడని, సోమవారం ఇంటికి వచ్చి చూడగా, బీరువా తెరిచి ఉందని తెలిపారన్నారు. బీరువాలో ఉన్న రెండున్నర సవర బంగారు నగలు పోయాయని తెలిపారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి క్లూస్ టీమ్ చేరుకొని వివరాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నామని సీఐ తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

గాయాల పాలైన వంశీ తేజ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని అమెరికన్ బార్ వద్ద మద్యం మత్తులో ఉన్న ఇరువురు వ్యక్తుల మధ్య గొడవ చోటు చేసుకుంది. గొడవ పడుతున్న వ్యక్తిని మూడో వ్యక్తి ప్రశ్నించడంతో అతని పై కత్తితో దాడి చేశాడు. గాలి వీధికి చెందిన బావ జాన్ మరో వ్యక్తితో గొడవ పడుతుండగా సప్తగిరి నగర్ చెందిన వంశీ తేజ ప్రశ్నించడంతో బావ జాన్ ఎదురుగా ఉన్న మటన్ షాపులకు దూరి, మటన్ కోసే కత్తితో వంశీ తేజపై దాడికి పాల్పడ్డాడు. గాయాల పాలైన తేజను స్థానికులు రుయాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నగలు, నగదు స్వాధీనం

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం, కొత్త ఇండ్లుకు చెందిన దోమలపాటి సిద్ధులు నాయుడు ఇంటికి 30.11.2024 తేదీన పగటిపూటే కన్నం వేసి, ఇంట్లో ఉండిన బంగారు ఆభరణాల నగదు దొంగలు దోచుకెళ్లారు. సిద్ధులు నాయుడు పోలీసుకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఎస్డిపిఓ బేతపూడి ప్రసాద్ పర్యవేక్షణలో సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.సుబ్బరామిరెడ్డి తన సిబ్బంది మునిరాజ, పురంధర్, గోపీలు విస్తృతంగా గాలించి, ముద్దాయి పులి నరేష్ అద్దెకు కాపురం ఉంటున్న ఎంఆర్ పల్లి పంచాయతీ వైకుంటపురం ఆర్చి సమీపంలోని శ్రీకృష్ణ నగర్‌కు వెళ్లి, విచారించి అతని వద్ద నుండి 301 గ్రాములు బంగారం, మూడు లక్షల రూపాయలు నగదు రికవరీ చేశారు. ఈ వివరాలు డి.ఎస్.పి బేతపూడి ప్రసాద్ చంద్రగిరి పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలోఎస్.ఐ అనిత, ముని రాజ, పురంధర్, గోపిలు పాల్గొన్నారు.

బావిలో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి పాలిటెక్నికల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి బషీర్ తన స్నేహితులతో దిగువ వీధులోని, ఓ రైతు బావిలోకి ఈతకు వెళ్లి, ఈత రాక చనిపోయాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చంద్రగిరి, రామచంద్ర నగర్‌కు చెందిన లేట్ మహబూబ్ బాషా కుమారుడు బషీర్ (16) చంద్రగిరి పాలిటెక్నికల్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం తన స్నేహితులు బన్నీ, సాయి, చరణ్, పునీత్‌లతో కలిసిదిగువ వీధిలోని ఓ రైతు బావిలోకి ఈతకు వెళ్ళాడు. బావిలోకి దిగిన బషీర్ ఎంతసేపటికి బయటకు రాకపోవటంతో స్నేహితులు స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. స్థానికులు, పోలీసులు హుటాహుటిన బావి వద్దకు వెళ్లి బషీర్‌ను వెలుపలకి తీసి చూడగా అప్పటికే చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని పోలీసులు శవ పరీక్ష నిమిత్తం తిరుపతి ఎస్‌వి వైద్య కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

In The Court of The Senior Civil Judge : Gudur
I.P.No. 11/2025

Pokuru Kamesh - Petitoner

Vs

1. Sk.Raheem
2. Kandanuru Sekhar
3. Pobolu Narayana
4. Nune Sreenivasulu
5. Perakam Pavan Krishna
6. Perakam Mallikarjuna
7. Kasa Surendra
8. Karnati Sudhakar
9. G.Chiranjeevi
10. Pacha Narasimha Naidu
11. Somisetty Bhaskar
12. Haranadh - Respondents

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు పిటిషనరు అయిన **Pokuru Kamesh** దివాలా తీసినందున ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై కోర్టులో **I.P. No. 11/2025** ను పిటిషన్ దాఖలు చేసియున్నందున సదరు I.P. పిటిషన్‌లో ఎవ్వరికైనను ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల **తేది: 18-6-2025** న వాయిదా ఉన్నది. ఆరోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలసింది యావన్మందికి తెలియజేయడమైనది.

బోమిడి సంజీవయ్య
పి.మాధురి
సిహెచ్.రాజేంద్రప్రసాద్ బాబు
ఎన్.ప్రసాద్
పిటిషనర్ తరపు అడ్వకేట్స్, గూడూరు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు, విలువలతో గుణాత్మక విద్యను అందిస్తున్నామని మండలంలోని కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ తెలిపారు. ఇటీవల విడుదలైన పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఫోటో, మార్కులతో కరపత్రాలు ప్రచురించి సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన సాగుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న పథకాలు, పాఠశాలలోని వసతులను తెలియజేశారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్చండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సోమవారం మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్లివెట్టు పరిధిలోని గాంధీ గిరిజన కాలనీ, వేణుగోపాలపురం గిరిజన కాలనీ, హెచ్ డబ్ల్యు కాలనీలను సందర్శించి బడి ఈడు పిల్లలను బడిలో చేర్చాలని, 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను సమీప నెలవాయి ఉన్నత పాఠశాలలో చేర్చాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సోమవారం ఉదయం 5వ తరగతి పూర్తి అయిన విద్యార్థులను ఆరవ తరగతిలో నెలవాయి జడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామదాస్, ఉపాధ్యాయులు పురుషోత్తం, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇల్లిల్లూ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు వివరించారు.

సబ్ రిజిస్ట్రార్ వైఖరిపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు సబ్ రిజిస్టర్ వైఖరిపై చర్యలు చేపట్టాలని తిరుపతి జిల్లా కాంగ్రెస్ నేతలు సుళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. చట్టాన్ని అతిక్రమించి కొన్ని భూములను రిజిస్ట్రేషన్ చేయడం దారుణమని తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బాలగురువం బాబు పేర్కొన్నారు. నోటిఫికేషన్ ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయడం చట్టానికి తూట్లు పొడిచినట్లేనన్నారు. తిరుపతి జిల్లాలో రెవెన్యూ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, సూళ్లూరుపేట డివిజన్లో కూడా పైసలు ఇవ్వనిదే పనులు జరగడం లేదని ఆయన విమర్శించారు.

ఏర్పేడు సిఐగా శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి- ఏర్పేడు : ఏర్పేడు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బి. శ్రీకాంత్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏర్పేడులో పని చేసిన సీఐ జయచంద్ర బదిలీల నిమిత్తం రేణిగుంట అర్బన్ సీఐగా బాధ్యతలు స్వీకరించగా తిరుపతి విఆర్ నుండి ఏర్పేడు సీఐగా శ్రీకాంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు.

పొదుపు రుణాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -కోట : ప్రతి ఒక్కరూ పొదుపు రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపిఎమ్ అనీలా కుమారి సూచించారు. సోమవారం కోట మండలంలోని వెలుగు కార్యాలయంలో వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ అనీలా కుమారి ఆధ్వర్యంలో మండలంలోని వివోఏలు, పొదుపు సభ్యులకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపిఎమ్ అనీలా కుమారి మాట్లాడుతూ ప్రభుత్వం నుండి అందించే రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుని సకాలంలో బ్యాంకుల్లో లావాదేవీలను జరుపుకోవాలని తెలిపారు. అంతేకాకుండా సంఘమిత్ర కమిటీని మార్పు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా వెలుగు కార్యాలయంలో నూతన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలో సంఘమిత్ర అధ్యక్షురాలుగా కొండేటి ముత్యాలమ్మ, కార్యదర్శి షేక్ షర్మిల, కోశాధికారి ఏనుగుదాటి మల్లేశ్వరి, ఉపాధ్యక్షురాలు ఇండ్ల వెంకటరమణమ్మ, సంయుక్త కార్యదర్శి కారిమేటి దేవికారాణి లను ఎంపిక చేయడం జరిగిందన్నారు.

సంఘమిత్ర అధ్యక్షురాలుగా ముత్యాలమ్మ

ప్రజాశక్తి -కోట: కోట మండలం, స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘమిత్ర కమిటీని నూతనంగా మార్పు చేయడం జరిగింది. ఈ సంఘమిత్ర కమిటీని స్థానిక ఏపిఎం అనీల కుమారి ఆధ్వర్యంలో ఎంపిక చేయడం జరిగింది. ఈ కమిటీలో సంఘమిత్ర అధ్యక్షురాలుగా కొండేటి ముత్యాలమ్మ, కార్యదర్శి షేక్ షర్మిల, కోశాధికారి ఏనుగుదాటి మల్లేశ్వరి, ఉపాధ్యక్షురాలు ఇండ్ల వెంకటరమణమ్మ, సంయుక్త కార్యదర్శి కారిమేటి దేవికారాణిలను ఎంపిక చేశామని ఏపిఎమ్ ఎస్.అనీలా కుమారి తెలిపారు.

హాస్టల్ విద్యార్థి ప్రతిభ.. కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - రేణిగుంట: తాజాగా విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో రేణిగుంట బి సి బాలుర వసతి గృహానికి చెందిన విద్యార్థి కె.వెంకటేష్ 600 మార్కులకు 559 మార్కులు సాధించి జిల్లా బి సి సంక్షేమ వసతి గృహాల ఫలితాలలో అగ్ర స్థానంతో నిలిచి, రేణిగుంటకు మంచి పేరు తెచ్చి పెట్టాడని, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ యస్.వెంకటేశ్వర్ రేణిగుంట హాస్టల్ విద్యార్థి కె.వెంకటేష్‌కు జ్ఞాపికను, ప్రశంసా పత్రాన్ని అందించి అభినందనలు తెలిపారు. ఈ వసతి గృహ సంక్షేమ అధికారి పల్లా వెంకటేశ్వర్లు పదవ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల రేణిగుంట హాస్టల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినారని జిల్లా కలెక్టర్ మరియు బి సి సంక్షేమ మరియు సాధికారత అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి, తిరుపతి సహాయ బి సి సంక్షేమ అధికారిణి జ్యోత్స్నలు వసతి గృహ సంక్షేమ అధికారి పల్లా వెంకటేశ్వర్లు సేవలను విద్యార్థి కె వెంకటేష్‌ను అభినందించారు. రేణిగుంట బి సి హాస్టల్‌లో మంచి ఫలితాలు రావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు రేణిగుంట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

కూటమిలో ఫ్లెక్సీల కొట్లాట

జనసేన ఫ్లెక్సీల తొలగింపు

టిడిపి బ్యానర్ల తొలగింపుకు జనసేన నిరసన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి కూటమి నేతల్లో మరోసారి వర్గ బేధాలు భగ్గుమన్నాయి. మా బ్యానర్లు తొలగించినప్పుడు, టిడిపి బ్యానర్లు ఎందుకు తొలగించరంటూ జనసేన నేతలు సోమవారం రాత్రి మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో చేసేదిలేక మున్సిపల్ అధికారులు అక్కడక్కడా కొన్ని బ్యానర్లను తొలగించి జన సైనికులను శాంతింపజేశారు. వివరాల్లోకి వెళితే ఈ నెల 25వ తేదీన జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కోట వినుత జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పట్టణ వ్యాప్తంగా జనసైనికులు ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. అయితే మరుసటి రోజే జనసేన బ్యానర్లు తొలగించాలంటూ మున్సిపల్ అధికారులు సూచించారు. పట్టణ నాలుగు మాడ వీధుల్లో బ్యానర్లు తొలగించిన జనసైనికులు, తక్కిన ప్రాంతాల్లో అలాగే ఉంచారు. దీంతో కొందరు టిడిపి కార్యకర్తలు ఆ బ్యానర్లను చించి మూత్ర విసర్జన చేసే ప్రాంతాల్లో విసిరి పారేశారు. సోమవారం విషయం తెలుసుకున్న జనసైనికులు మున్సిపల్ అధికారులు ఎదుట నిరసనకు దిగారు. తమ నాయకురాలు జన్మదినానికి బ్యానర్లు వేస్తే ఒక్కరోజులోనే తొలగించే సారనీ, మరి నెలలు తరబడి టిడిపి బ్యానర్లు పట్టణంలో దర్శనమిస్తున్నాయనీ, పట్టణ ప్రజలకు, ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని, అవి మీకు కనిపించలేదా అంటూ వాగ్వాదానికి దిగారు. జనసేన బ్యానర్లతో పాటు, టిడిపి బ్యానర్లు కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో తలొగ్గిన మున్సిపల్ అధికారులు నాటకీయ పరిణామాల మధ్య కొన్ని బ్యానర్లను తొలగించడం గమనార్హం.

'భవిత' విద్యార్థుల విభిన్న ప్రతిభ

ప్రజాశక్తి - సూళ్లూరుపేట: మానసిక వైకల్యం, అంగ వైకల్యంతో సంబంధం లేకుండా మార్కుల ప్రభంజనాల గోలతో సంబంధం లేకుండా భవితా కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్రత్యేక అవసరాలు విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో విభిన్న ప్రతిభను చాటి విజేతలుగా నిలిచారు. సూళ్లూరుపేట మండల స్థాయిలో సెరిబ్రల్ పాలసీ వైకల్యం కలిగిన భవితాకేంద్రం విద్యార్థిని డి.హారిక, సెరిబ్రల్ పాలసీ వైకల్యం కలిగిన గవర్నమెంట్ హై స్కూల్ సూళ్లూరుపేట విద్యార్థి పి. శ్రీనివాసులు, బుద్ధిమాంద్యం కలిగిన జిల్లా పరిషత్ హై స్కూల్ కోటపోలూరు విద్యార్థి డి. మునిసాగర్ సాధారణ విద్యార్థులతో నిలబడి తమ సత్తా చాటారు. ఈ విజయం స్ఫూర్తిదాయకము అని ఎంఈఓ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ చిన్నారులలో ప్రత్యేకమైన సామర్థ్యాలు దాగి ఉంటాయని, వాటిని ఆధారంగా చేసుకుని వీరికి శిక్షణ ఇస్తే వారు ఇలాంటి ఫలితాలు మరెన్నో సాధించగలరని భవితా కేంద్ర ఉపాధ్యాయురాలు వీ.టి.భార్గవి తెలిపారు. ఈ విజయం తమకు గర్వంగా ఉందని చెప్తూ వీరిని ఇంతటితో ఆగకుండా 18 సంవత్సరాల వయసు తర్వాత ఉద్యోగంలో పెట్టే ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉస్మాన్‌బాష, దివ్యాంగుల హక్కుల వేదిక నాయకురాలు శాంతకుమారి షీల్డ్, నగదు బహుమతి ఇచ్చి అభినందించారు. భవిత ఉపాధ్యాయులు ఎన్.సాయిసంధ్య, సూర్యకుమారి, కనకమ్మ పాల్గొన్నారు

డి.సి.ఎం.ఎస్ చైర్మన్‌గా పల్లిలేని సుబ్రహ్మణ్యం నాయుడు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) డిసిఎంఎస్ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ చంద్రగిరి మండల అధ్యక్షులు పల్లెనేని సుబ్రహ్మణ్యం నాయుడును నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పది డీసీఎంఎస్ చైర్మన్‌ల పేర్లలో వి.సుబ్రమణ్యం నాయుడు పేరును ఖరారు చేస్తూ పార్టీ అధిష్టానం ప్రకటన విడుదల చేసింది. ఆయన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను పలువురు అభినందించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి -ఏర్పేడు : పాపానాయుడుపేట, మర్రిమందలో శ్రీ లక్ష్మీ హయగ్రీవ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శాస్త్రముక్తంగా నిర్వహించారు. సోమవారం ప్రతిష్ట సందర్భంగా నిర్వహించిన పూజల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అత్తూరు గిరిప్రసాద్ రెడ్డి, కలతూరు మురళీమోహన్ రెడ్డి, ట్రెజరర్ కలతూర్ కుమార్ రెడ్డి, గుడిమల్లం దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ బత్తల గిరినాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి -కోట : కోట మండలం లక్మక్క కండ్రిగలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మోడల్ మేకర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్ళి డేటా సేకరించడం జరుగుతుందని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయడానికి ప్లానింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే (నవధాన్యాలు) చల్లడం వలన లాభాలు, ఏటీఎం మోడల్ గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేసే శేషాచలం, జనార్ధన్ అనే రైతుల సన్మానించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ విఏఏ దినేష్, అంగన్వాడీ వర్కర్ మండల ఇన్చార్జి పి.పద్మ, భాగ్యలక్ష్మి, భాగ్యమ్మ, రైతులు పాల్గొన్నారు.

కోట బార్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి -కోట: కోట మండలం, సివిల్ జడ్జి కోర్టులో మొదటిసారిగా న్యాయవాదులకు బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. సోమవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఎన్నికల అధికారి ఎల్.రామచంద్రా రావు ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఎన్.మధుసూదన్ రావు, టి.మహేష్‌లు ప్రెసిడెంట్‌లుగా పోటీలో నిలబడ్డారు. ఈ పోటీలో నాలుగు ఓట్ల మెజారిటీతో ప్రెసిడెంట్‌గా ఎన్.మధుసూదన్ రావు ఎంపికయ్యారు. అత్తికాయల మోహన్ వైస్ ప్రెసిడెంట్‌గా నాలుగు ఓట్ల మెజారిటీతో ఎన్నుకున్నారు. సెక్రటరీగా ఎస్.వెంకటేశ్వర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా పి.వి.రమణ, ట్రెజరర్‌గా ఆర్.కాటయ్య,ఈసి మెంబర్లుగా ఎమ్.సూర్యా, పి.సాగర్ లను ఏకగ్రీవంగా ఎన్ను కోవడం జరిగింది. అసోషియేషన్ సభ్యులు ఎంపికైన వారిని సత్కరించారు.

అన్నపూర్ణ క్యాంటీన్‌కు టెండర్‌లు ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనం సమీపంలోని అన్నపూర్ణ క్యాంటీన్ కి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఎం.భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో 6 మాసాల కిందట క్యాంటీన్‌కు టెండర్లు పిలిపించి అత్యధిక కొటేషన్ చేసిన జయవర్ధన నాయుడుకి క్యాంటీన్ బాడుగకు ఇవ్వడం జరిగింది. అయితే అధిక బాడుగ ధర కారణంగా తాను దుకాణం నిర్వహించలేనని వర్సిటీకి లేఖ ఇవ్వడంతో వర్సిటీ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి దాన్ని రద్దు చేశారు. గతంలో రెండు క్యాంటీన్లకు టెండర్లు పిలిచినప్పుడు రెండు క్యాంటీన్లను అత్యధిక కొటేషన్ ఇచ్చిన జయచంద్రనాయుడుకు రావడంతో పలువురు విద్యార్థి సంఘాల నేతలు, గత క్యాంటీన్ నిర్వహకులు ఒక క్యాంటీన్ మీరు ఉంచుకుని, మాకు ఇంకొక క్యాంటీన్ నిర్వహించుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరినా, వినకుండా ఆయన రెండు క్యాంటీన్లును సొంతంగా కొనసాగించారు. అయితే ప్రస్తుతం ఒక క్యాంటీన్‌ను మాత్రం కొనసాగించలేనని వర్సిటీకి లేఖ ఇవ్వడం పట్ల విద్యార్థి సంఘాల నేతలు వర్సిటీ అధికారులపైన అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వర్సిటీ ఉన్నతాధికారులు క్యాంటీన్ టెండర్ పిలిచేటప్పుడు క్యాంటీన్ లీజును సంవత్సరం, రెండు సంవత్సరాలు, మూడు సంవత్సరాలు వంటి పరిమితిని విధించడం, అలాగే రెండు క్యాంటీన్లను ఒకరికే చెందకుండా చూసేలా తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. టెండర్ అప్లికేషన్ ఇవ్వడానికి మే మూడవ తేదీ 4:30 గంటలకు గడువుని విధించారు. అప్లికేషన్ పూర్తి చేసి ఈఎండి అమౌంటు చెల్లించేందుకు మే 5వ తేదీ 4:30 గంటల వరకు గడువునిచ్చారు. టెండర్లను టెక్నికల్ బిడ్డు, ఫైనాన్షియల్ బిడ్లను 19వ తేదీ ఉదయం 11 గంటలకు ఒకటి, 12:30 గంటలకు మరొకటి ఓపెన్ చేస్తామని తెలిపారు. క్యాంటీన్ టెండర్ నోటీస్‌కి సంబంధించి పూర్తి వివరాల కోసం 0877-2289414, 0877 - 2289354, 2289382 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

న్యాయమూర్తికి ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి పి.లోకనాథం బదిలీపై వెళుండడంతో సోమవారం గూడూరు బార్ అసోసియేషన్ సభ్యులు వీడ్కోలు సభ నిర్వహించి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 7 వ అదనపు జిల్లా జడ్జి కే.వేంకట నాగ పవన్, సీనియర్ సివిల్ జడ్జి బీ.రాజేష్, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శంకరయ్య, గూడూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాశంకర్, హరిప్రసాద్, వెంకట కృష్ణయ్య, ఎం.శ్రీనివాసులు, కమిటి సభ్యులు, న్యాయ వాదులు పి.సాయికుమార్ రెడ్డి, కొత్తపల్లి వసంత కుమార్, ఎస్.చంద్రమోహన్ రెడ్డి, పీ.గోపాల్ రెడ్డి, అంబటి కోటేశ్వర రావు, సుహాసిని, వనం ప్రసాద్, తీగల చంద్రశేఖర్, కలవలపూడి నవకోటి, సాయి, అనిల్, సుమన్, ఈ. మధు, యూసఫ్, నాగుర్, వహీదా, ప్రతాప్ కుమార్, ఏడుకొండలు, సుమన్, విజయ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.